# సాక్షి
## వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 18 । జూలై । 2024






### మల్బరీ సాగుతో కాసుల వర్షం

మల్బరీ నర్సరీల సాగుతో ఆరు నెలల్లో పెట్టుబడికి మించి రెట్టింపు ఆదాయం పొందొచ్చు. ఊటకూరు, వనిపెంట నర్సరీల్లో మొక్కల సాగుకు శ్రీకారం చుట్టారు. -8లో



### కృష్ణా, విశాఖ జట్ల విజయకేతనం

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా, విశాఖ, సెంట్రల్ జోన్ జట్లు విజయం సాధించాయి. -8లో

### వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.8/25.4

జిల్లాలో బుధవారం 25.4 - 34.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

## • ఏకాదశి శోభ



దేవుని కడప లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తజన సందడి

తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రసిద్ధ ఆలయాలను వేకువజాము నుంచే భక్తులు సందర్శించి పూజలు చేశారు. దేవుని కడపలోని శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. గోవింద నామ స్మరణతో ఆలయం మార్మోగింది.

## • మొహరం వైభవం

జిల్లాలో మొహరం ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. తొమ్మిది రోజులుగా పలు గ్రామాలు, పట్టణాల్లో పీర్ల చావిడిలో కొలువైన పీర్లకు చివరి రోజైన బుధవారం నిర్వహించిన ఊరేగింపు ఘట్టం ఆకట్టుకుంది. పెద్ద సంఖ్యలో ప్రజలు కులమతాలకు అతీతంగా పాల్గొని ప్రార్థనలు చేశారు.

-సాక్షి, నెట్‌వర్క్



పోరుమామిళ్లలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

## న్యూస్‌రీల్

### స్విమ్మింగ్‌లో కడప వాసికి 5 బంగారు పతకాలు



పతకాలతో త్రిభువన్‌రెడ్డి

కడప స్పోర్ట్స్: కడప నగరానికి చెందిన బిక్కా త్రిభువన్‌రెడ్డి రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటాడు. ఈనెల 13,14 తేదీల్లో కర్నూలు క్రీడాప్రాధికార సంస్థ స్విమ్మింగ్‌పూల్‌లో నిర్వహించిన 40వ సబ్ జూనియర్ అంతర్ జిల్లాల అక్వాటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో గ్రూప్-3 విభాగంలో పాల్గొని పతకాల పంట పండించాడు. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు ఫ్రీస్టైల్ విభాగం, 50 మీటర్లు, 100 మీటర్లు బటర్‌ఫ్లై విభాగంలో మొత్తం 5 స్వర్ణపతకాలు సాధించడంతో పాటు వ్యక్తిగత చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నాడు. దీంతో ఆగస్టు 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు భువనేశ్వర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు అతన్ని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన తల్లిదండ్రులు నారాయణరెడ్డి, అను, కోచ్‌లు సతీష్ కుమార్, రాజేంద్ర, యోగీశ్వర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి రాజశేఖర్, క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి జగన్నాథరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

### ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్ కావాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి రమణారెడ్డి

పోరుమామిళ్ల (అట్లూరు): ప్రభుత్వ ఉద్యోగులకు ఓపీఎస్ అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి.వి.రమణారెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల రీజియన్ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్‌ను ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేయాలని, అలాగే ఐఆర్ వెంటనే ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్జిత సెలవుల బకాయిలను చెల్లించాలన్నారు. డీఏలు, ఏపీజీఎల్ఐ, పీఎఫ్ లోన్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. కోర్టు కేసుల కారణంగా నిలిచిపోయిన స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతులు ఇవ్వాలని, పాఠశాల నిర్వహణ గ్రాంట్లు విడుదల చేయాలన్నారు. పాఠశాల విద్యుత్ బకాయిలను ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర, జిల్లా, మండల కార్యదర్శులు ఎస్.ఏ.సత్తార్, ఎస్.భాస్కర్‌రెడ్డి, రాంభూపాల్‌రెడ్డి, ఎం.నరసింహారెడ్డి, ఎస్.కె.అన్వర్‌బాష, జె.సుబ్బయ్య, కె.బాలిరెడ్డి, కె.గురివిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లెక్క తేల్చుకుందాం రండి!

- టీడీపీలో దుమారం రేపుతున్న డబ్బుల పంపిణీ వ్యవహారం
- రాజంపేటలో రచ్చకెక్కిన పంచాయితీ
- కడపలో కాంగ్రెస్ నేతల మండిపాటు
- రాజంపేట ఎంపీ అభ్యర్థిత్వంలోనూ డబ్బే కీలకం
- తంబళ్లపల్లెలో తల పట్టుకుంటున్న టీడీపీ అభ్యర్థి



సాక్షి ప్రతినిధి, కడప: సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. టీడీపీ అధికారంలోకి వచ్చింది. ఆ పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు పోస్టుమార్టం పనిలో నిమగ్నమయ్యారు. తమ ఓటమికి కారణాలను వెతుక్కుంటున్నారు. ఈ క్రమంలో సొంత పార్టీకి చెందిన కొందరు నాయకుల సహాయ నిరాకరణ వల్లే తాము ఓడిపోయామనే భావనలో ఉన్నారు. దీనికితోడు ఓటర్లకు పంచాల్సిన డబ్బు నాయకుల జేబుల్లోకి వెళ్లిందని.. అందుకే తాము ఓడిపోయామని విశ్లేషించుకుంటున్నారు. దీంతో ఎన్నికల ఖర్చుకు సంబంధించిన లెక్కలు తేలుద్దాం రండి అంటూ అభ్యర్థులు ఆయా నేతలకు కబురు పంపుతున్నా స్పందన కొరవడింది.

**సుగవాసి.. నేతలు ముఖం చాటేసి**

రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఎన్నికలు ముగిసినప్పటి నుంచి డబ్బు పంపిణీ విషయంపైనే దృష్టి సారించారు. డబ్బు పంపిణీ వ్యవహారంపై లెక్కలు చూసుకుందాం రమ్మంటూ నాయకులను పిలుస్తుండటం తెలుగు తమ్ముళ్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. కొందరైతే ముఖం చాటేశారు. దాంతో మరింత అనుమానాలు బలపడ్డాయి. గోడకు కొట్టిన సున్నం.. ఎన్నికల్లో పెట్టిన వ్యయం తిరిగి రాదనేది నిజమని తెలిసినా.. నేతలు చేసిన మోసంపై సుగవాసి రగిలిపోతున్నట్లు తెలుస్తోంది. రాజంపేటలో ఓడిపోవడానికి గల కారణాలను స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు సుగవాసి బాలసుబ్రమణ్యం వివరించారు.

ఈ నేపథ్యంలో పలువురు నేతల వ్యవహార శైలి, తీరు తెన్నులపై కూడా ఫిర్యాదు చేసినట్లు ఆ పార్టీలో ప్రచారం జరుగుతోంది. మరోవైపు అభ్యర్థి బాలసుబ్రమణ్యం పోల్ మేనేజ్‌మెంట్‌లో విఫలమయ్యారని ఆ పార్టీ నేతలు కూడా ప్రత్యారోపణలు చేస్తున్నారు. దాంతో ఎవరు ఎంత మొత్తం తీసుకెళ్లారు. ఏమేరకు ఓటర్లకు అందించారనే విషయంపై బాలసుబ్రమణ్యం ఆరా తీయడం మొదలు పెట్టారు. ఇలా ఈ డబ్బుల వ్యవహారం నియోజకవర్గంలో దుమారం రేపుతోంది. ఈ నేపథ్యంలో కొద్దిరోజుల క్రితం రాజంపేట పట్టణానికి చెందిన తన సామాజికవర్గం నేత ఒకరిని బాలసుబ్రమణ్యం పిలిపించినట్లు సమాచారం. ఎన్నికల్లో అప్పగించిన డబ్బుకు లెక్కలు చెప్పాలని నిలదీసినట్లు తెలుస్తోంది. తన దగ్గర తీసుకెళ్లిన డబ్బును ఎవరెవరికి ఎంత ఇచ్చారో వారిని కూడా తీసుకురావాలని చెప్పడంతో సదరు నేత ఫైర్ అయ్యారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగినట్లు తెలిసింది.

**▸▸ కడపలో.. కాకమీదున్న కాంగ్రెస్**

కడప కాంగ్రెస్ అభ్యర్థిగా అనూహ్యంగా అఫ్జల్‌ఖాన్ తెరపైకి వచ్చారు. టీడీపీ నుంచి సుమారు 2.5 కోట్లు ముట్టగా.. కాంగ్రెస్ పార్టీ నుంచి ఇస్తామన్న డబ్బులో కొంతమేరకే అందినట్లు సమాచారం. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఓ నగర నేత అభ్యర్థి నుంచి సుమారు రూ.67 లక్షలు వసూలు చేసుకుని క్యాడర్‌కు ఇవ్వకుండా ముఖం చాటేసినట్లు సమాచారం. దీంతో ఆ పార్టీ నేతలు కొందరు అభ్యర్థిపై గరంగరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఓవైపు కాంగ్రెస్ పార్టీ ఏజెంట్లుగా కూర్చున్నవారికి కూడా చెల్లింపులు చేయలేదు. మరోవైపు ఎన్నికల్లో పనిచేసిన కేడర్‌కు ఇచ్చిన హామీ మేరకు డబ్బులు ఇవ్వకపోవడంపై కూడా పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు స్వయంగా అభ్యర్థి కార్యాలయానికి వెళ్లి ఇదే విషయమై పలుమార్లు ప్రశ్నించడంతో అంతో ఇంతో సర్దుబాటు చేసి పంపినట్లు వినికిడి.

**▸▸ డబ్బులు దండుకుని.. జేబులు నింపుకుని**

'తంబళ్లపల్లె టీడీపీ టికెట్ ఇచ్చేందుకు నా వద్ద పార్టీ నేతలు డబ్బులు దండుకున్నారు. అధిష్టానం దూతలమంటూ కొందరు కోట్లు దండుకున్న తర్వాతే టికెట్ కేటాయించారు. మరోవైపు తన నుంచి తీసుకున్న డబ్బును పార్టీ కేడర్ జనానికి ఆశించిన మేరకు చేర్చలేదు' అని ఎన్నికల్లో ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి అనుచరుల వద్ద పలుమార్లు వాపోయినట్లు సమాచారం. ప్రచారానికి సమయం తక్కువ ఉన్నా ఆ స్థాయి ఆదరణ లభించిందంటే కేవలం మొరుసుకాపు సామాజిక వర్గ నేతలు విశేషంగా పనిచేయడమే కారణమని ఆయన చెప్పుకొస్తున్నారు. బీసీ నేతల సహాయ నిరాకరణ తదితర విషయాలన్నీ ఏకరువు పెడుతున్నట్లు సమాచారం. ఇలా ఎక్కడికక్కడ తెలుగుదేశం పార్టీలో మనీ పాలి'ట్రిక్స్' హాట్‌టాపిక్‌గా మారాయి.

**నాన్ లోకల్.. రూ.3 కోట్లు ఆఫర్:** రాజంపేట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా ఎస్కే బాషీద్ తెరపైకి వచ్చారు. తెనాలికి చెందిన ఆయన హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. కారణాలు ఏమైనప్పటికీ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయాలనే ఉత్సాహం ఆయనలో ఉండింది. దీంతో తెలంగాణకు చెందిన సతీష్ అనే వ్యక్తిని సంప్రదించి ఏపీలో టికెట్ ఇప్పించాల్సిందిగా కోరినట్లు సమాచారం. అందుకోసం రూ.3కోట్లు ఆఫర్ ఇచ్చినట్లు ఆరోపణలు లేకపోలేదు. ఆ మేరకే నాన్ లోకల్ అభ్యర్థి తెరపైకి వచ్చినట్లు ఆ పార్టీ వర్గాలు అప్పట్లో మండిపడ్డాయి. కాగా టిక్కెట్ కోసం ఇస్తానన్న రూ.3కోట్లలో కొంత మొత్తం మాత్రమే సతీష్‌కు ఇచ్చినట్లు తెలుస్తోంది. సతీష్‌కూడా పార్టీ ఫండ్ ఇవ్వకుండా హ్యాండిచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలో అసెంబ్లీ అభ్యర్థులకు ఒక్క పైసా కూడా అందకపోవడంతో వారంతా ఎంపీ అభ్యర్థిపై గుర్రుగా ఉన్నారు.

### సెప్టెంబర్ 28, 29 తేదీల్లో టైప్ పరీక్షలు



ప్రొద్దుటూరు కల్చరల్: స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ వారు మ్యాన్యువల్ టైప్ రైటింగ్ పరీక్షలను సెప్టెంబర్ 28, 29తేదీల్లో నిర్వహిస్తున్నారని ఏపీ టైప్ రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ కార్యనిర్వాహక కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 28, 29 తేదీల్లో ఇంగ్లీషు, తెలుగు లోయర్, హయ్యర్ గ్రేడ్, హైస్పీడ్, ఇంగ్లీషు జూనియర్ గ్రేడ్ పరీక్షలను, హిందీలోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా 35 పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నారన్నారు. అలాగే సెప్టెంబరు 21, 22తేదీల్లో తెలుగు, ఇంగ్లీష్ షార్ట్‌హ్యాండ్ పరీక్షలను రాష్ట్ర వ్యాప్తంగా 6 పరీక్షా కేంద్రాల్లో జరుగుతాయని చెప్పారు. విజయవాడ షార్ట్‌హ్యాండ్ పరీక్షా కేంద్రాన్ని రద్దు చేసి గుంటూరులో నిర్వహిస్తున్నారన్నారు. రెండున్నర నెల సమయం ఉన్నందున ఆసక్తి గల వారు దగ్గరలోని టైప్ ఇన్‌స్టిట్యూట్‌లో సంప్రదించి ఫీజులు చెల్లించి పరీక్షకు హాజరు కావాలని కోరారు.

### నూతన కార్యవర్గం ఎన్నిక



ఈశ్వరచంద్రరావు



ఏఎంఎం ఆలీఖాన్

కడప ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్ అమరావతి కడపజిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కడప జిల్లా అధ్యక్షులుగా కే.ఈశ్వరచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా ఏఎంఎం ఆలీఖాన్, అసోసియేట్ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌రెడ్డి , అదనపు కార్యదర్శిగా వీరప్రసాద్, కోశాధికారిగా సాయిప్రతాప్, ఉపాధ్యక్షుడిగా రాజగోపాల్, కార్యదర్శిగా ఏ .పద్మజ. రాష్ట్ర కౌన్సిలర్‌గా సీవీ ప్రసాద్ ఎంపికయ్యారు.

# తాళ్లపాకలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

రాజంపేట: పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమయ్య స్వయంగా అర్చించి, సేవించిన చెన్నకేశవస్వామి , సిద్దేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఉదయం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సిద్దేశ్వర స్వామి, చెన్నకేశవస్వామి దేవాలయాల్లో వేర్వేరుగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని వేద పండితులు నిర్వహించారు. సాయంత్రం సిద్దేశ్వర స్వామి హంస వాహనంపై, చెన్న కేశవస్వామి శేష వాహనంపై విహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. ఈ సందర్భంగా ఆర్. శ్యామ్‌కుమార్ బృందం ఊంజల్ సంగీతం , లీలావతి, లక్ష్మిదేవి, గంగావతి బృందాలు తమ కోలాటాలతో భక్తులను అలరించారు. ఈ కార్యక్రమంలో తాళ్లపాక సమూహ దేవాలయాల పర్యవేక్షణాధికారి వై. హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ బాలాజీ, గురుస్వామి యాదవ్, వినోద్‌కుమార్, తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రామ్ అసిస్టెంటు గోపి బాబు తదితరులు పాల్గొన్నారు.





శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం, హంసవాహనంపై ఊరేగుతున్న శ్రీ సిద్దేశ్వరస్వామి

**హంసవాహనంపై సిద్దేశ్వరుడు**

తాళ్లపాక బ్రహ్మోత్సవాలలో తొలిరోజు రాత్రి శ్రీ సిద్దేశ్వరస్వామి హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ చెన్నకేశవస్వామి శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కళాకారులు భజనలు చేశారు. శ్రీ సిద్దేశ్వరుడు, శ్రీ చెన్నకేశవస్వామికి పురవీధుల్లో భక్తులు కాయకర్పూరాలను సమర్పించుకున్నారు.

# టీడీపీ నేతలను కట్టడి చేయండి

- చంద్రబాబుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఫోన్
- గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను అడ్డుకోవడంపై సీరియస్
- దీంతో పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి తలంటిన సీఎంవో



సాక్షి ప్రతినిధి, కడప: కమీషన్ల కోసం వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గంలో బెంగళూరు-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను టీడీపీ నేతలు అడ్డుకోవడం, దిలీప్ దిల్కాన్ సంస్థను బెదిరించి పనులను నిలిపేయడం, కాంట్రాక్టర్ క్యాంపు ఆఫీసుకు నిప్పు పెట్టడంపై కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఫోన్ చేసి టీడీపీ నేతలను కట్టడి చేయాలని కోరినట్టు తెలుస్తోంది. తమకు కమీషన్లు ఇస్తేనే పనులు సాగనిస్తామంటూ టీడీపీ నేతలు కాంట్రాక్టరును బెదిరించడం ఏమిటని గడ్కరీ నిలదీసినట్టు సమాచారం. ఎన్నికల ఖర్చులు కాంట్రాక్టు సంస్థ భరించడం సాధ్యమౌతుందా? ఇలాంటి పరిస్థితుల్లో పనులు ఎలా చేయాలని చంద్రబాబును ఆయన ప్రశ్నించినట్టు భోగట్టా. ఇలాంటి పోకడలకు స్వస్తి చెప్పాలని హెచ్చరించినట్టు తెలుస్తోంది.

**బీటెక్ రవికి సీఎంవో నుంచి ఫోన్..**

నితిన్ గడ్కరీ హెచ్చరికతో ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో) నుంచి పులివెందుల టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవికి మంగళవారం ఫోన్ వెళ్లినట్టు తెలుస్తోంది. ఇకపై ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా ఉపేక్షించబోమని, పరిధి దాటి ప్రవర్తించవద్దని హెచ్చరించినట్టు సమాచారం. ప్రతిష్టాత్మకమైన గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులకు ఆటంకం కల్పించడం ఏమాత్రం సమంజసం కాదని తేల్చిచెప్పినట్టు తెలుస్తోంది. 'గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి వస్తుందంటే ప్రతి ఒక్కరూ గర్వించాలి. అలాంటిది ఆ పనులే చేయకుండా అడ్డగిస్తారా? అభివృద్ధి పనులకు ఎక్కడా ఆటంకాలు కల్పించవద్దు. ఇలాంటివి పునరావృతమైతే ఎంతటి వారినైనా ఉపేక్షించం' అంటూ సీఎం కార్యాలయం బీటెక్ రవిని హెచ్చరించినట్టు తెలుస్తోంది.

**▸▸ కమీషన్ల కోసం పనులను అడ్డుకున్న టీడీపీ నేతలు..**

బెంగుళూరు నుంచి విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవేలో భాగంగా ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. అందులో మూడు ప్యాకేజీలు దిలీప్ దిల్కాన్ సంస్థకు దక్కాయి. మరో మూడు ప్యాకేజీలు మెగా కంపెనీకి లభించాయి. వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం పరిధిలో రూ.700 కోట్లతో దిలీప్ దిల్కాన్ సంస్థ పనులు చేస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా శరవేగంగా పనులు సాగాయి. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ సంస్థపై ఆ పార్టీ నేతలు దౌర్జన్యానికి దిగారు. పనులు నిలిపేయాలంటూ వేల్పుల గ్రామం వద్దకు స్థానిక టీడీపీ నాయకుడు వెళ్లి అడ్డగించారు. పనులు సాగాలంటే తమ నాయకుడితో పర్సనల్‌గా మాట్లాడుకోవాలని ఆదేశించారు. ఆ సంస్థ జీఎం స్థాయి వ్యక్తి ఫోన్‌లో సంప్రదిస్తే ఎలాంటి ఫలితం లేకపోగా, తమకు ఎన్నికలకు చాలా ఖర్చయిందని.. కప్పం చెల్లిస్తేనే పనులు కొనసాగుతాయని టీడీపీ నేతలు స్పష్టం చేశారు. నిర్మాణ పనులు కొనసాగిస్తే సహించబోమని హెచ్చరికలు జారీ చేశారు. ఈ క్రమంలోనే ఈనెల 6న సబ్ కాంట్రాక్టర్ శివప్రసాదరెడ్డికి చెందిన క్యాంపు కార్యాలయాన్ని తగులబెట్టారు.

# ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

**జిల్లా నూతన ఎస్పీ హర్షవర్ధన్ రాజు**

కడప అర్బన్: ఎర్రచందనం అక్రమరవాణపై ఉక్కుపాదం మోపుతామని నూతన ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీగా ఆయన బుధవారం బాధ్యతలను చేపట్టారు. ఈసందర్భంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు మాట్లాడుతూ ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలో అన్నమయ్య జిల్లాకు మొదటిసారి పదోన్నతిపై ఎస్పీగా పనిచేశాను. ఈ రోజు మళ్లీ వైఎస్ఆర్ జిల్లా ఎస్పీగా బాధ్యతలను స్వీకరించడం సంతోషంగా ఉందని అన్నారు. కడపకు రాగానే తిరుమలేశుని తొలిగడప, దేవునికడప శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి నేరుగా కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయానికి విచ్చేశారు. మొదట గౌరవవందనం స్వీకరించారు. ఎస్పీ ఛాంబర్‌లో పూజల అనంతరం శాస్త్రోక్తంగా వేదపండితుల ఆశీర్వచనం తరువాత హర్షవర్ధన్ రాజు ఎస్పీగా బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేలా కృషి చేస్తామన్నారు. గంజాయి నిర్మూలనకు కార్యాచరణ ప్రణాళికతో చర్యలు తీసుకుంటామన్నారు. భూకబ్జాలు, క్రికెట్ బెట్టింగ్, ఇతర చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు.గల్ఫ్ బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు జవాబుదారితనంతో పోలీస్ యంత్రాంగం విధులు నిర్వర్తించాలని, అందరూ చట్టానికి లోబడి ఉద్యోగం చేయాలని ఎస్పీ తెలిపారు. కడప నగరంలో సీసీ కెమెరాలను పనితీరును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ జి. వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్. వి కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, తదితరులు వున్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

### పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం కృషి చేస్తాం

పోలీసు యంత్రాంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ ఏవైనా సమస్యలుంటే నేరుగా తనను కలిసి చెప్పవచ్చని, వారి సంక్షేమం కోసం కృషి చేస్తామనీ నూతనంగా బాధ్యతలను చేపట్టిన జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు అన్నారు. బుధవారం ఎస్పీని పోలీసు అధికారుల సంక్షేమ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. వెల్ఫేర్ సంబంధించిన ఎలాంటి అంశాలనైనా తన దృష్టికి తీసుకుని రావాలన్నారు. వాటిపై మంచి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్, జాయింట్ సెక్రటరీ రఘునాథరెడ్డి ఎగ్జిక్యూటివ్ సభ్యులు దామోదర్‌రెడ్డి, మాధవిలత, సభ్యులు రాచరాయుడు, సుబ్బరాయుడు, ఆంజనేయులు, పుల్లయ్య, బ్రహ్మయ్య, ప్రసాద్, మురళి, దౌలా పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### పుష్పగిరిలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పూజలు



సంతాన మల్లేశ్వరుడికి అభిషేకం చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, తదితరులు

వల్లూరు : తొలి ఏకాదశి సందర్భంగా పవిత్ర పుణ్య క్షేత్రం పుష్పగిరిని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి కుటుంబసభ్యులతో కలిసి పుష్పగిరి ఆలయాలను బుధవారం సందర్శించారు. అర్చకులు సుమంత్ దీక్షితులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కొండపై లక్ష్మీ చెన్నకేశవస్వామి, సంతాన మల్లేశ్వర స్వామి ఆలయాలను న్యాయమూర్తి సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ శిల్ప సంపద, పవిత్ర పెన్నా నదిని పరిశీలించారు. ఈ సందర్భంగా అర్చకులు క్షేత్ర విశిష్టత, చరిత్ర గురించి వివరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### దళిత అమరవీరులకు శ్రద్ధాంజలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కారంచేడు ఘటన చీకటి రోజును స్మరించుకుంటూ కడప ఆర్టీసీ బస్టాండులోని అంబేద్కర్ విగ్రహం ఎదుట కారంచేడు దళిత అమరవీరులకు దళిత గిరిజన హక్కుల పోరాట సంఘం నాయకులు మడగలం ప్రసాద్ బుధవారం శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారంచేడు సంఘటన పునరావృతం కాకుండా దళితులకు రక్షణ కల్పించాలని కోరారు. భారత రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించినప్పటికీ విచక్షణా రహితంగా దాడులు చేయడం తగదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కంటి తుడుపు చర్యగా స్పందిస్తున్నారేగానీ, వాటిని నిర్మూలించడంలో విఫలమయ్యారన్నారు.

### మానవత్వం చూపిన హిజ్రాలు



గాయపడిన యువకుడికి చికిత్స చేయిస్తున్న హిజ్రాలు

బద్వేలు అర్బన్ : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన ఓ యువకుడిని ఆసుపత్రిలో చేర్పించి హిజ్రాలు మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే కమలాపురం పట్టణానికి చెందిన జయప్రకాష్‌రెడ్డి బద్వేల్‌లోని బంధువుల ఇంటికి ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. బద్వేలు – మైదుకూరు రహదారిలోని నందిపల్లె సమీపంలో వెనుక వైపు నుండి వస్తున్న లారీని తప్పించే క్రమంలో బైక్ నుంచి అదుపు తప్పి కిందపడి గాయాలయ్యాయి. అక్కడే ఉన్న హిజ్రాలు అంజలి, వెన్నెల యువకుడిని తమ స్కూటీలో ఎక్కించుకుని తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేర్పారు. వైద్యం ముగిసే వరకు యువకుడి బాగోగులు చూసుకున్నారు.

### రేషన్ బియ్యం పట్టివేత

చెన్నూరు : చెన్నూరు పట్టణంలోని రాజుల కాలనీలో బియ్యం గోదాములపై సిబ్బందితో కలిసి బుధవారం దాడులు నిర్వహించినట్లు సీఐ నారాయణయాదవ్ తెలిపారు. గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన 103 బస్తాల బియ్యాన్ని సీజ్ చేసి, యజమాని కాటం వీరబ్రహ్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ చౌకబియ్యాన్ని అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# మల్బరీ సాగుతో కాసుల వర్షం

తక్కువ పెట్టుబడితో అనతి కాలంలో రైతులకు అందించేందుకు ప్రభుత్వం కిసాన్ మల్బరీ(ప్రైవేటు)ల నర్సరీ సాగుకు ప్రోత్సాహంఅందిస్తోంది. ఈ మల్బరీ నర్సరీల సాగుతో ఆరు నెలల్లో పెట్టుబడికి మించి రెట్టింపు ఆదాయం పొందే అవకాశం కల్పిస్తోంది.



ఊటకూరు నర్సరీలో సాగులో ఉన్న మల్బరీ మొక్కలు



మల్బరీ మొక్కలను నాటుతున్న కూలీలు

- కిసాన్ నర్సరీ(ప్రైవేట్) నిర్వహణకు ప్రభుత్వ ప్రోత్సాహం
- ఎస్సీ, ఎస్టీలకు 90, ఇతరులకు 75 శాతం రాయితీ
- ఊటకూరు, వనిపెంట నర్సరీల్లో మొక్కల సాగుకు శ్రీకారం

| యూనిట్ | నాటాల్సిన మొక్కలు | ఇచ్చే డబ్బులు | సబ్సిడీ |
|---|---|---|---|
| 1 ఎకరం | 1,60,000 | 1,35,000 | 90% (ఎస్సీ, ఎస్టీ) |
| 1 ఎకరం | 1,60,000 | 1,12,500 | 75% (ఇతరులు) |

కడప అగ్రికల్చర్ : మల్బరీ సాగు చేసే రైతులకు నాణ్యమైన మొక్క అందించడానికి నర్సరీల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. కడప జిల్లా కేంద్రం శివారులోని ఊటకూరు, మైదుకూరు మండలం వనిపెంట పట్టు పరిశ్రమల శాఖ క్షేత్రంలోనూ ప్రభుత్వం మల్బరీ నర్సరీల సాగుకు శ్రీకారం చుట్టింది. 2024–25 సంవత్సరానికి ప్రతి నర్సరీలో రెండు లక్షల మల్బరీ మొక్కల సాగు లక్ష్యంగా పెట్టుకుంది. ఊటకూరు క్షేత్రంలో ఇప్పటికే 1,20,000 మొక్కలు నాటించగా, త్వరలో వనిపెంట నర్సరీలోనూ నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 425 ఎకరాల్లో మల్బరీ సాగు లక్ష్యం కాగా, ఈ నర్సరీల నుంచి రైతులకు మొక్కలు అందజేయనున్నారు.

**పంట సాగుకు రాయితీ**

పంట సాగుకు అయ్యే ఖర్చులో ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఓసీ, బీసీ, ఇతరులకు 75 శాతం ప్రభుత్వం రాయితీ ఇవ్వనుంది. ఆసక్తి గల రైతులు నర్సరీల సాగుకు ముందుకు రావాలని పట్టు పరిశ్రమ శాఖ పిలుపునిచ్చింది. ఎకరా కిసాన్ నర్సరీలో 1,60,000 మొక్కలు నాటితే ఈ రాయితీ వర్తిస్తుంది. యూనిట్‌కు రూ.1,50,000 వరకు ప్రభుత్వం అందిస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం రాయితీపై రూ.1,35,000, ఓసీ, బీసీ, ఇతరులకు 75 శాతం రాయితీపై రూ. 1,12,500 రాయితీ లభిస్తుంది. మిగిలిన మొత్తాన్ని రైతు భరించాల్సి ఉంటుంది. 4 నుంచి 5 నెలలపాటు నర్సరీల్లో మల్బరీ మొక్క పెంచి తరువాత రైతులకు విక్రయించాల్సి ఉంటుంది. మల్బరీ తోటలు సాగు చేసే రైతులు నర్సరీల నుంచి ఒక్కో మొక్కకు రూ.2 చెల్లించి తెచ్చుకోవచ్చు. ఇలా విక్రయించడం ద్వారా నర్సరీ సాగుచేసే వారికి అదనంగా రూ.2,40,000 ఆదాయం వస్తుంది.

**రెండు విడతల్లో రాయితీ చెల్లింపు**



ప్రభుత్వం నర్సరీ సాగు చేసే రైతుకు రెండు విడతల్లో రాయితీ అందించడం జరుగుతుంది. నర్సరీ సాగు చేసిన 45 రోజుల తరువాత సాగు చేసిన మొక్కల్లో 75 శాతం బతికితే తొలి విడతగా సగం డబ్బు అందజేస్తాం. ఆ తరువాత నర్సరీలో మొక్కల అమ్మకం పూర్తయిన తరువాత మిగిలిన మొత్తం అందిస్తాం. – అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమశాఖ అధికారి

## జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక



జిల్లా ఫుట్‌బాల్ జట్టు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాల క్రీడా మైదానంలో బుధవారం జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె.థామస్ జీవన్ బాబు, కార్యదర్శి సుధీర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు గంగులయ్య, శ్రీను, వై.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

**జిల్లా ఫుట్‌బాల్ జట్టు** : ఎస్. ప్రజ్వల్ దీప్, ఎస్.అఖిలేష్‌రెడ్డి, జి.దామోదర్, ఎస్.రిహాన్, పి.ఇర్ఫాన్‌ఖాన్, సి.జశ్వంత్‌రాజ్, సి.చైతన్య, సి.ఎస్.తనీష్‌రెడ్డి, ఎస్.ముబారక్, వి.వివేక్, జె.డేవిడ్, డి.అబ్దుల్, వై.యశ్వంత్‌కుమార్, సి.సుమంత్, కె.శుభకర్, ఎన్.జాషువాపాల్, ఎస్.సుదర్శన్, ఎ.గుణశేఖర్.

**స్టాండ్‌బై** : ఎస్.సులేమాన్, పి.యువతేజ, ఇ.మణికంఠ, టి.హార్దిక్

## సాగునీటి హక్కులకు విఘాతం

గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం.ఓబులేసు యాదవ్



కడప అగ్రికల్చర్ : ఆంధ్ర ప్రదేశ్ సాగు నీటి హక్కులకు విఘాతం కలిగించేలా కేంద్రం తీసుకొచ్చిన గెజిట్ ఉందని గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎం.ఓబులేసుయాదవ్ అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ ఎస్.వో.4375(ఈ) ద్వారా కొత్తగా చేర్చిన అంశాల ఆధారంగా బ్రిజేష్ కుమార్ కమిటీ చేపట్టిన విచారణ ఏపీకి ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు. బచావత్ ట్రిబ్యునల్ కష్ణానదీ జలాలను ప్రాజెక్టుల వారీగా పంపిణీ చేసి మార్చడానికి వీలు లేకుండా చట్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేసారు. తెలంగాణ రాష్ట్రానికి లబ్ధి చేకూరేలా కేంద్ర ప్రభుత్వం జీవో తేవడం తగదని, తక్షణమే రద్దు చేయాలని విన్నవించినా పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు నాయడు తక్షణమే అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేసి జీవో రద్దు చేసే దిశగా ప్రధానమంత్రిపై ఒత్తిడి తేవాలని కోరారు.

## సౌత్ ఇండియా హాకీ పోటీల్లో ఆంధ్రా విజయం



ఆంధ్రా జట్టుతో మున్సిపల్ ఛైర్మెన్ వర ప్రసాద్

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని వైఎస్సార్ హాకీ క్రీడా మైదానంలో జరిగే సౌత్ ఇండియా హాకీ చాంపియన్ షిప్ హాకీ క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. వారం రోజులుగా జరుగుతున్న ఈ పోటీలలో కేరళ, పాండిచ్చేరి, తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల బాలబాలికల జట్లు పాల్గొన్నాయి. బుధవారం జరిగిన ఇండియా హాకీ జూనియర్ ఉమెన్ సౌత్ జోన్ మ్యాచ్ ఫైనల్‌లో కర్ణాటకపై 0–5గోల్స్‌తో ఆంధ్ర ప్రదేశ్ ఉమెన్ టీం ఘన విజయం సాధించింది. వారిని మున్సిపల్ ఛైర్మెన్ వరప్రసాద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో చాణుక్యరాజ్, శేఖర్, ప్రవీణ్‌కిరణ్, శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## విడాకులివ్వలేదని గొంతునులిమి చంపేశాడు

భార్య హత్య కేసులో భర్త అరెస్టు



అరెస్ట్ వివరాలను మీడియాకు వివరిస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం : విడాకులు ఇవ్వలేదనే కారణంతో భార్యను గొంతు నులిమి చంపేసిన భర్తను రూరల్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో అరెస్ట్ వివరాలను డీఎస్పీ మురళీధర్ వెల్లడించారు. పట్టణంలోని అమృతానగర్‌కు చెందిన అన్వర్ బాషా ఈ నెల 12న భార్య రేష్మాను ఎకోపార్క్ సమీపంలో గొంతు నులిమి చంపేసి గోతిలో పాతిపెట్టిన విషయం తెలిసిందే. మృతుడి సోదరుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి విచారించారు. భార్యపై అనుమానం పెంచుకున్న అన్వర్ బాషా తనకు విడాకులిస్తే రెండో పెళ్లి చేసుకుంటానని కొన్ని రోజుల నుంచి రేష్మాపై ఒత్తిడి తెచ్చారు. 'నీ భార్యగానే చస్తాను గానీ విడాకులు ఇచ్చేది లేదు' అని ఆమె చెప్పడంతో భార్యభర్తల మధ్య తరచూ గొడవలు తలెత్తాయి. కొన్ని రోజుల క్రితం తన భర్తతో గొడవపడి రేష్మా పెన్నా నగర్‌లోని తన పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. అనంతరం ఆమెను ఎలాగైనా చంపాలని కుట్ర చేసిన అన్వర్‌బాషా ఈ నెల 12న పెన్నా నగర్‌కు వెళ్లి పార్కుకు వెళ్దాంరా అంటూ భార్యను పిలిచాడు. రేష్మా భర్త వెంట బైక్‌లో వెళ్లగా ఎకోపార్కులో సరదాగా గడిపారు. అనంతరం రేష్మాకు మాయ మాటలు చెప్పిన భర్త రిజర్వ్ ఫారెస్ట్ స్థలంలోని ముళ్ల పొదల్లోకి తీసుకెళ్లి గొంతు నులిమి చంపేశాడు. కొద్ది సేపటి తర్వాత అక్కడే గోతి తీసి ఆమె మృతదేహాన్ని పూడ్చేశాడు. దర్యాప్తులో భాగంగా నిందితుడైన అన్వర్‌బాషాను బుధవారం రూరల్ సీఐ రమణారెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లి అరెస్ట్ చేశారు. అతడి నుంచి మోటార్ బైక్, రెండు సెల్‌ఫోన్లు, హత్యకు ఉపయోగించిన చున్నీని స్వాదీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

## భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలి

ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి



జ్యోతి క్షేత్రం వేద పండితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి

పోరుమామిళ్ల(అట్లూరు) : అవధూత కాశినాయన భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ డీసీ.గోవిందరెడ్డి కోరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోఆయన మాట్లాడుతూ అటవీ శాఖ, కాశినాయన భక్తుల మధ్య వరికుంట్ల జ్యోతి క్షేత్ర స్థలం అభివృద్ధి వివాదంపై ఆయన స్పందించారు. గడచిన ఐదేళ్లలో 113 ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి రూ.29 కోట్లు ఖర్చు చేశామన్నారు. గత ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో కాశినాయన జ్యోతి క్షేత్రం అభివృద్ధి నివేదికను కేంద్ర అటవీ శాఖ మంత్రికి పంపామని తెలిపారు. నూతన ప్రభుత్వం అభివృద్ధికి సహకరించి ప్రజల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ కె.రమణారెడ్డి, జ్యోతి క్షేత్రం వేద పండితులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాలతోనే దివ్యాంగుల పింఛన్ పెంపు



మాట్లాడుతున్న విజయసారథి

ప్రొద్దుటూరు : వీహెచ్‌పీఎస్ సుదీర్ఘ పోరాటాల ఫలితంగా తెలుగు రాష్ట్రాల్లో దివ్యాంగుల పింఛన్ పెంచారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. ప్రొద్దుటూరులో బుధవారం జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలపై గతంలో ఉద్యమాలు చేశామని, దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వని విధంగా తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక పింఛన్ మొత్తం దివ్యాంగులకు అందిస్తున్నారన్నారు. వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీలో ప్రొద్దుటూరుకు చెందిన రామ్మోహన్‌రెడ్డికి స్థానం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాగులారపు విజయసారథి, సీవీ.సురేష్, శివశంకర్ మాదిగ, అష్లల్, చలపతిరావు పాల్గొన్నారు.

## నర్సరీ యజమానులపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె సిటీ : నాణ్యత లేని మొక్కలు విక్రయిస్తున్న నర్సరీ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏపీ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. నర్సరీ యజమానులు నాసిరకం నారు అంటగట్టి కోట్లాది రూపాయలు సంపాదిస్తున్నారన్నారు. విచ్చలవిడిగా నకిలీ విత్తనాలు అమ్ముతున్న కంపెనీలు, నర్సరీ యజమానులపై చర్యలు తీసుకోకపోవడం చాలా దారుణమన్నారు. కలికిరి, మదనపల్లె రైతులు నర్సరీల నుంచి బొప్పాయి నారు కొనుగోలు చేసి పొలాల్లో నాటగా.. పూత, పిందె ఉన్నప్పటికీ కాయ సైజు పెరగలేదని తెలిపారు. ఎకరాకు రెండు లక్షల రూపాయలు నష్టపోయారన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ జిల్లాలో ఉద్యానవన పంటల ప్రోత్సాహానికి ఎలాంటి సహకారం ఇవ్వకపోవడంతో రైతు నష్టపోతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కె.రామకృష్ణ, గంగిరెడ్డి, అనిల్‌కుమార్, గంగరాజు, రామమూర్తి, గురునాథ, నారాయణ, రాఘవేంద్రయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా, విశాఖ జట్ల విజయకేతనం



వైఎస్ఆర్ఆర్-ఏసీఏ మైదానంలో తలపడుతున్న కృష్ణా, కడప జట్లు



సుశాంత్ (105 పరుగులు)



వరుణ్‌సాత్విక్ (106 పరుగులు )

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాలే వేదికగా నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జోనల్ వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో కృష్ణా, విశాఖ, సెంట్రల్ జోన్ జట్లు విజయం సాధించాయి. వైఎస్ఆర్ఆర్–ఏసీఏ మైదానంలో బుధవారం నిర్వహించిన మ్యాచ్‌లో కడప, కృష్ణా జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 50 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. జట్టులోని వరుణ్ సాత్విక్ 106 పరుగులు, సాయి అఖిల్ 59 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 46.5 ఓవర్లలో 190 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్ వర్మ 52 పరుగులు చేశాడు. కృష్ణాబౌలర్లు రాజేష్ 4 వికెట్లు, సాయిప్రకాష్ 3 వికెట్లు తీశారు. దీంతో కృష్ణా జట్టు 57 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

**విశాఖ జట్టు విజయభేరి**

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో విశాఖపట్నం, రెస్టాఫ్ సౌత్ జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సౌత్‌జోన్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 212 పరుగులు చేసింది. జట్టులో మన్విత్‌రెడ్డి 70 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖ జట్టు 37.3 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని ఈశ్వర్ రితిక్ 69, హ్రితిక్ వర్మ 53, యువన్ 57 పరుగులు చేశాడు. దీంతో విశాఖ జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

**రెస్టాఫ్ సెంట్రల్ జట్టు విజయం..**

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెస్టాఫ్ నార్త్ జోన్, రెస్టాఫ్ సెంట్రల్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెంట్రల్‌జోన్ బ్యాటింగ్ ఎంచుకుని 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 363 పరుగుల భారీ స్కోరు చేసింది. జట్టులోని నాగకుమార్ 83, సాత్విక్ 84, మనోహర్ 61 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్ జోన్ జట్టు 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 292 పరుగులు చేసింది. జట్టులోని సుశాంత్ 105 పరుగులు, మురళి 79 పరుగులు చేశాడు. కాగా సెంట్రల్‌జోన్ జట్టు 71 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది.

### దౌర్జన్యకారుల నుంచి కాపాడండి

– ఎస్పీకి బాధితుడి వినతి

కడప సెవెన్‌రోడ్స్ : తన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి బెదిరిస్తున్న వారి నుంచి రక్షణ కల్పించాలని బాధితుడు కృష్ణారెడ్డి జిల్లా ఎస్పీని బుధవారం కోరారు. బాధితుడు కృష్ణారెడ్డి వివరాల మేరకు... అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం నూలివీడు పొలంలోని సర్వే నెంబర్–2476లో తన అన్న కుమారుడు సురేంద్రారెడ్డి, హరినాథరెడ్డి, తనకు భూమి ఉందని తెలిపారు. వారిద్దరూ తన భూమిలో దౌర్జన్యంగా ప్రవేశించి మొక్కలు పీకేయడమేగాక, పొలం చుట్టూ కంచె వేశారన్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే తనను, తన సతీమణిని దుర్భాషలాడి చంపుతామని బెదిరిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఆడియో రికార్డింగ్ ఉందన్నారు. సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కృష్ణారెడ్డి కోరారు.

### ఆర్మీ జవాన్ మృతి

– కురబలకోటలో విషాదం

కురబలకోట : ఆర్మీ జవాన్ అనారోగ్యంతో మృతి చెందిన విషాదకర సంఘటన అన్నమయ్య జిల్లా కురబలకోట వాసుల్లో విషాదం నింపింది. గ్రామస్తుల కథనం మేరకు.. కురబలకోటకు చెందిన నాగరాజుకు ఒక్కడే కుమారుడు పగడాల వెంకటేష్ (29). దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో తొమ్మిదేళ్ల క్రితం ఆర్మీలో నాగరాజు జవాన్(సీఎఫ్ఎన్)గా చేరాడు. సికింద్రాబాద్, పంజాబ్, రాజస్థాన్‌లో పని చేశాడు. జూన్ 24న తిరిగి విధులకు వెళ్లగా 27న అక్కడ అస్వస్థతకు గురయ్యాడు. కిడ్నీ సమస్యతో రాజస్థాన్‌లోని జోథ్‌పూర్ మిలిటరీ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అదే రోజున మిలిటరీ అధికారులు కుటుంబీకులకు సమాచారం తెలియజేశారు. రెండు రోజుల్లో మృత దేహం కురబలకోటకు రానున్నట్లు తెలిసింది.

### మాండవ్య నదిని శుభ్రపరచండి



మాండవ్య నదిని పరిశీలిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు

రాయచోటి అర్బన్ : పట్టణం నడిబొడ్డున మురుగు నీటి గుంటగా మారిన మాండవ్య నదిని శుభ్రం చేయాలని భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర నేత టి.ఈశ్వర్, పౌర హక్కుల సంఘం నేత పి.రెడ్డెయ్య డిమాండ్ చేశారు. మాండవ్య నదిని బుధవారం వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ మాండవ్య నదిలో మురుగు చేయడంతో దోమల ఉత్పత్తి కేంద్రంగా మారిందన్నారు. దోమల వ్యాప్తితో పట్టణ వాసులు విష జ్వరాలతో రాయచోటి ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారన్నారు. లక్షలాది రూపాయలు ఖర్చు చేయలేక తల్లడిల్లిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సాయి థియేటర్ నుంచి చల్లంపల్లె వరకు నదిలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం యుద్ధప్రాతిపదికన తొలగించి, కాల్వలకు మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నేత రామాంజనేయులు, బాస్ రాష్ట్ర కార్యదర్శి తాతయ్య, న్యాయవాదులు ధనుంజయ ఆనంద్, చిన్నయ్య, రవిశంకర్, చంద్రశేఖర్, మారుతి, చల్లా రెడ్డెయ్య, రమేష్ బాబు, శ్రీనివాసులు,తదితరులు పాల్గొన్నారు.

### అప్పల బాధతో రైతు ఆత్మహత్య

ఓబులవారిపల్లె(రైల్వేకోడూరు అర్బన్) : ఓబులవారిపల్లె మండలం గాదెల గ్రామానికి చెందిన రైతు ఎం.పెద్దవెంకటయ్య (89) బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నారు. బంధువుల కథనం మేరకు.. పెద్ద వెంకటయ్య కొన్ని సంవత్సరాలుగా అరటి చెట్లు సాగు చేస్తున్నాడని, ఏటా నష్టాలు రావడంతో పెట్టుబడుల కోసం అప్పులు అధికమై కలత చెందారన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మర్రిమాను వద్ద పొలానికి ఉపయోగించే గడ్డిమందు(విషద్రావణం) తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడన్నారు. హుటాహుటిన తిరుపతి ఆసుపత్రికి తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

### సీసీ రోడ్డు తొలగింపునకు టీడీపీ నేత యత్నం

– అడ్డుకున్న మూలపల్లి గ్రామస్థులు



జేసీబీ సాయంతో సీసీ రోడ్డు తొలగించడానికి యత్నిస్తున్న తెదేపా నాయకులు

లక్కిరెడ్డిపల్లి : ప్రభుత్వం నిర్మించిన సీసీ రహదారిని టీడీపీ నేతలు జేసీబీతో ధ్వంసం చేసేందుకు యత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. వివాదం పరిష్కరించాల్సిన పోలీసులు తన పొలంలో వేసిన రోడ్డు తొలగించేందుకు యత్నించడంతో గొడవ జరిగిందని చెప్పడంతో ఆశ్చర్యపోయారు. అన్నమయ్య జిల్లా మూలపల్లిలో గత ప్రభుత్వం సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టింది. బుధవారం స్థానిక టీడీపీ నేత ఓబుల్‌రెడ్డి, అతడి అనుచరులు జేసీబీ తీసుకువచ్చి రోడ్డు తొలగించేందుకు ప్రయత్నించారు. ఇది తెలుసుకున్న మూలపల్లె గ్రామస్థులు మూకుమ్మడిగా అడ్డుకున్నారు. ప్రభుత్వ ధనంతో నిర్మించిన రోడ్డు ఎలా తొలగిస్తారని గ్రామస్థులు నిలదీయడంతో స్థానికులకు టీడీపీ నేతలకు మధ్య వాగ్వాదం పెరిగి ఉద్రిక్తత చోటుచేసుకుంది. అధికార పార్టీకి తొత్తుగా వ్యవహరించే అధికారులు అడ్డుకోవాల్సిన సమయంలో ప్రేక్షక పాత్ర వహించడం తగదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సీసీ రోడ్డు తొలగిస్తే ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఎస్ఐ విష్ణువర్ధన్, సిబ్బంది చేరుకుని జేసీబీని అక్కడినుంచి పంపివేశారు. ఇరు వర్గాలను పిలిపించి నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరించేలా చూస్తామని తెలిపారు. అయితే తన పొలంలో రోడ్డు వేయడంతో తొలగించేందుకు యత్నించానని ఓబుల్‌రెడ్డి చెప్పినట్లు పోలీసులు తెలిపారు.